# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ విజయవాడ నుండి శ్రీశైలం వరకు కృష్ణా నదీ జలాలపై నిర్వహించిన 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతమయ్యింది.

- ❖ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

- ❖ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత తెలియజేశారు.

- ❖ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

========================

విజయవాడ నుండి శ్రీశైలం వరకు నిర్వహించిన 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయ్యింది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద నుండి శ్రీశైలానికి వచ్చిన 'సీ ప్లేన్' అక్కడి జలాశయం నీటి ఉపరితలం మీద సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. తరువాత సీ ప్లేన్ అక్కడి నుండి శ్రీశైలం టూరిజం బోటింగ్ జట్టీ వద్దకు చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు. రేపు పున్నమి ఘాట్‌లో విజయవాడ నుంచి శ్రీశైలంకు 'సీ ప్లేన్' ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. 14 సీట్లు కలిగి ఉన్న ఈ సీ ప్లేన్‌ను డీ హవిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ రూపొందించింది.

========================

సమాజ అభివృద్ధికి దోహదపడే నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా

పెదకాకాని మండలం నంబూరులోని ఒక కళాశాలలో ఈరోజు నిర్వహించిన వికాస్ - 2024 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... దేశంలో అంకుర సంస్థల స్థాపనకు గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. “వికసిత్ భారత్” కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులను వెలికితీసి, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. 2024 సంవత్సరానికి ముందు భారత్‌లో తక్కువ సంఖ్యలో అంకుర సంస్థలు ఉండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. “వికసిత్ భారత్” వంటి కార్యక్రమాలు దేశ సుస్థిర ప్రగతికి దోహదపడతాయని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

======================

శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుక్కపట్నం చెరువులో బోటింగ్ ను ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి, పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో లేపాక్షి, ప్రశాంతి నిలయం, తిమ్మమ్మ మర్రిమాను సహా ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. బుక్కపట్నం చెరువు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోందని, మరింత మంది సందర్శకులను ఆకట్టుకునేలా ఇక్కడ బోటింగ్ ప్రవేశపెట్టామని అన్నారు. త్వరలో బుక్కపట్నం చెరువు వద్ద ఫుడ్ కోర్టు కూడా ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

======================

ప్రజా సమస్యలపై చర్చించేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 11వ తేదీన మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 3 రోజుల పాటు జరుగనున్న “యువతరంగ్ – 2024” సంస్కృతిక కార్యక్రమాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గత 4 నెలలుగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వాన్ని మెచ్చుకోవాల్సిన వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

(వాయిస్ 35 సెకన్లు)

======================

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్.నాయుడు తిరుమలలోని సన్నిధానం అతిథిగృహంలో చైర్మన్ క్యాంప్ కార్యాలయాన్ని ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన సిబ్బందికి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కాగా... ఈరోజు ఉదయం టిటిడి పాలకమండలి సభ్యులుగా మరో ఐదు గురు ప్రమాణ స్వీకారం చేశారు. క్రిష్ణమూర్తి, వైద్యనాథన్, సౌరభ్ బోరా, సదాశివరావు, పనబాక లక్ష్మిలు పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి, అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

విరామం

======================

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా “ఫ్రైడే.. డ్రైడే” కార్యక్రమాలను నిర్వహించాలని, వాటి ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ఉదయం కంచరపాలెం ఓల్డ్ ఐటీఐ ప్రాంతంలో నిర్వహించిన “ఫ్రైడే-డ్రైడే

కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఎం హెచ్‌వో పి. జగదీశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి కాలనీని సందర్శించి, స్థానికులతో మాట్లాడారు. ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

=======================

జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ గిరిజనులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఛలో పాడేరు కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు, వివిధ ప్రజా సంఘాల నేతలు భారీ ర్యాలీ నిర్వహించి, పాడేరు ఐటీడీఏ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఎన్నికల హామీల్లో భాగంగా జీవో నెంబర్-3కు చట్టబద్ధత కల్పిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలను నూరు శాతం గిరిజనులకే కల్పించాలని కోరారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల హక్కుల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం "మీకోసం" కార్యక్రమంలో సంఘ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు.

=======================

పేద మహిళల అభ్యున్నతి కోసం క్షేత్రస్థాయిలో డిఆర్డిఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి కోరారు. డి ఆర్ డి ఏ లో అమలయ్యే పథకాలపై ఆ శాఖ అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేద, నిరుపేద మహిళలను లక్షాధికారులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల అభ్యున్నతిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జిల్లాలో 3 లక్షల 40 వేల 725 మంది మహిళలు పొదుపు చేసుకుంటూ... 33 వేల 374 డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఒక వెయ్యి 31 గ్రామ సంఘాలు నడుస్తున్నాయని కలెక్టర్ తెలియజేస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=======================

బాలబాలికలు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని స్కూల్ గేమ్స్ జిల్లా చైర్మన్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి. నాగరాణి అన్నారు. ఈరోజు ఆమె భీమవరంలోని శ్రీ చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలను సాధించి, క్రీడాకారులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఈ క్రీడలను సోపానాలుగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటమి చెందిన వారు నిరాశకు గురి కావద్దని.. ఒక ఓటమి మరో విజయానికి నాంది అవుతుందని అన్నారు.

=======================

రైలు ప్రమాదాలు సంభవించినపుడు చేపట్టవలసిన చర్యలను చూపిస్తూ... వాల్తేర్ రైల్వే డివిజన్ పరిధిలోని సింహాచలం రైల్వే స్టేషన్ లో ఈరోజు మాక్ డ్రిల్ నిర్వహించారు.

=======================
=======================